క్లుప్తంగా

కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

మాడుగుల రూరల్ : కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుదారుల ఆదాయం రూ.1.20 లక్షల లోపు కలిగి ఉండాలని, జి.యస్.డబ్ల్యు.యస్. హౌస్ హోల్డ్ డేటా బేస్‌లో నమోదై వుండాలని, వారిలో ఎవరికీ రైస్‌కార్డు ఉండరాదని, అవసరమైన పత్రాలు, కుటుంబ సభ్యులు, ఆధార్ కార్డు ఉండాలన్నారు.వివాహం లేదా జననం ద్వారా కుటుంబంలో మార్పులకు సంబంధించి అవసరమైన పత్రాలు, వివాహం ధ్రువీకరణ పత్రం ,వివాహ సమయంలో తీసిన దంపతులు ఫొటో, జననం ద్వారా జనన ధ్రువీకరణపత్రం విధిగా వుండాలన్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం సచివాలయంలో నమోదు చేసుకోవాలన్నారు.

అంబేడ్కర్ నాటకాన్ని జయప్రదం చేయాలి



ఆటో ప్రచారం నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు

నర్సీపట్నం : సంఘం శరణం గచ్చామి డా.బి.ఆర్.అంబేడ్కర్ నాటకం జయప్రదం చేయాలంటూ ఆటో ప్రచారం నిర్వహించారు. బుధవారం నర్సీపట్నం సిటీ క్లబ్ అవరణలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ నిర్వహిస్తున్న అంబేడ్కర్ నాటకాన్ని విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి పిలుపునిచ్చారు. అంబేడ్కర్ సమాజం కోసం చేసిన కృషి ఈ నాటక రూపంలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకుడు కె.త్రిమూర్తులరెడ్డి, గిరిజన సంఘం నాయకుడు రాము, రైతు సంఘం నాయకుడు నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనకు నీతి కథలు దోహదం



విద్యార్థులకు నీతి కథలు వినిపిస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి

కె.కోటపాడు : క్రీడలతో చిన్నారుల ఎదుగుదలలో మార్పు కలగనున్నట్లు చౌడువాడ శాఖా గ్రంథాలయాదికారిణి ఎం.పద్మావతి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆటల పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు బాల్ గేమ్, మ్యూజికల్ చైర్‌ను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నీతికథలు చదివి వినిపించారు. మంచి సత్ప్రవర్తనను విద్యార్థులు కలిగి ఉండాలని విద్యార్థులకు ఉద్బోధించారు.

వనరుల వినియోగంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

రావికమతం : కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు మంగళవారం మత్స్యవానిపాలెం గ్రామంలో వనరులు ఎలా ఉపయోగించుకోవాలో పటం ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో నీటి సమస్య ఎక్కువగా ఉంటుందని వేసవిలో పశువులను ఎలా చూసుకోవాలో రైతులకు వివరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బీఎస్సీ విద్యార్థినులు మత్స్యవానిపాలెం గ్రామం మధ్యలో పటం వేసి రైతులకు వివరించారు.

కె.జె.పురం జంక్షన్‌లో మజ్జిగ చలివేంద్రం



అన్నదాన సత్రం వద్ద మజ్జిగ పంపిణీ ప్రారంభించిన ఆలయ కమిటీ చైర్మన్ అమ్మతల్లినాయుడు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత అన్నదాన సత్రం వద్ద భక్తులకు ఉచితంగా మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. దీంతో పాటు మంగళవారం నుంచి భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఉచిత మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశారు. సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచితంగా మజ్జిగ పంపిణీ జరుగుతుందన్నారు.

సీఎస్‌ఆర్ నిధులతో సీసీ రోడ్లు



గునుపూడి హైస్కూల్లో వేసిన సిమెంట్ రోడ్డు



పీహెచ్‌సీ వెళ్లే దారిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం

గునిపూడి హైస్కూలు ప్రాంగణం అభివృద్ధి

పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్లు

ఏలేరు రిజర్వాయర్, జీవీఎంసీ అధికారుల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

నాతవరం : ఎంతో కాలంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, రోగులు సమస్యకు ఏలేశ్వరం రిజర్వాయరు జీవీఎంసీ అధికారులు సంయుక్తంగా మోక్షం కలిగించారు. మండలంలో గునుపూడి గ్రామం మీదుగా ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి ఏలేరు కాలువ ద్వారా నీరు నిత్యం ప్రవహిస్తుంది. వైజాగ్‌కు నిత్యం నీరు ప్రవహించడం వల్ల గునుపూడి హైస్కూల్‌కు వెళ్లే రోడ్డంతా బురదమయంగా తయారవుతుంది. అలాగే గునుపూడి పీహెచ్‌సీ ప్రాంగణంలో సైతం మట్టి రోడ్డు కావడంతో రోడ్డు లీకేజీ నీరు కారణంగా రోగులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. ఏలేరు కాలువ గట్టుపై కూడా రాకపోకలు సాగించేందుకు ప్రజలు అనేక అవస్థలు పడేవారు. ఈ ప్రాంతంలో ఏలేరు కాలువ ఎత్తులో గునుపూడి గ్రామం పల్లపు ప్రదేశంలో ఉండడంతో కాలువ నీరు లీకేజీతో మట్టి రోడ్లు అధ్వానంగా తయారు కావడం, ఏమాత్రం వర్షం పడినా నడవడానికి వీలు లేని విధంగా దర్శనమిచ్చేవి. ఈ సమస్యపై దృష్టి సారించిన ఏలేరు రిజర్వాయరు జీవీఎంసీ అధికారులు సంయుక్తంగా సీఎస్ఆర్ నిధులు రూ.37లక్షలతో మట్టి రోడ్లన్నీ సిమెంట్ రోడ్లుగా వేశారు. ప్రధానంగా హైస్కూల్‌కు వెళ్లే రోడ్డుతో పాటు హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సిమెంట్ రోడ్డు వేశారు. జాతీయ జెండాను అవిష్కరించేందుకు సర్వాంగసుందరంగా దిమ్మ, జెండా కర్ర ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ ప్రాంగణంలోకి వాహనాలు వెళ్లడానికి రోగులు రాకపోకలు సాగించేందుకు సిమెంట్ రోడ్డు వేశారు.



జాతీయ జెండా కోసం ఏర్పాటు చేసిన కర్ర దిమ్మ

సమస్య పరిష్కరించారు..



మా హైస్కూలుకు వెళ్లడానికి రోడ్డు సరిగా లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఏమాత్రం వర్షం పడినా హైస్కూల్ ప్రాంగణంతో పాటు రోడ్డు సైతం బురదమయంగా తయారయ్యేది. అధికారులు సిమెంటు రోడ్లు నిర్మించడంతో సమస్య పరిష్కారమైంది.

–టి.శివ జ్యోతి, హెచ్ఎం, గునుపూడి హైస్కూల్

వీటితో పాటు రైతులు వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు పాంత రోడ్డును అభివృద్ధి చేశారు. ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి విశాఖపట్నం నీరు తరలించేందుకు ఏర్పాటు చేసిన ఏలేరు కాలువ నాతవరం మండలంలో ఎక్కువ కిలోమీటర్లు ఉంది. ఈ ఏడాది సీఎస్ఆర్ నిధులతో గునుపూడి గ్రామంలో రహదారుల అభివృద్ధికి నిర్ణయించారు. ఆయా పనులు మార్చి నెలలో ప్రారంభించి పూర్తి చేశామని ఏలేరు కాలువ డీఈ గోపీనాథ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కోటమ్మతల్లి పండగ

నాతవరం : శ్రీకోటమ్మ తల్లి పండగ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. మర్రిపాలెం పంచాయతీ శివారు సిద్దిపట్నం గ్రామంలో గల శివ శక్తి పీఠంలో వేలసిన కోటమ్మ తల్లి పండగను భక్తులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. గత నెలలో అమ్మవారి గరగలు ఉత్సవాన్ని ఆలయ నిర్మాణ దాత వేద పండితులు సత్యనారాయణమూర్తిశర్మ ఆధ్వర్యంలో ప్రారంభించి పుర వీధుల్లో ఊరేగించారు, అనాటి నుంచి నేటి వరకు ప్రతి రోజు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పలు హోమాలు అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారు నుంచే అమ్మవారికి పూజలు చేసి ఉత్సవమూర్తులను పుర వీధుల్లో ఊరేగించారు. సంప్రదాయం ప్రకారం మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి పిండి వంటలు తయారు చేసి సారె పెట్టి సాగనంపారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసి పోయింది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు వేదపండితులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఉచితంగా తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



ఉత్సవ మూర్తుల ఊరేగింపులో వేదపండితులు సత్యనారాయణమూర్తి శర్మ, భక్తులు



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

బాలికల్లో రక్తహీనతపై అశ్రద్ధ వద్దు

బుచ్చెయ్యపేట : రక్తహీనత ఉన్న బాలికల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయకుండా తగిన పోషకాలున్న ఆహారం తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి లక్ష్మీ దుర్గ తెలిపారు. మంగళాపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాస బాలల వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె గ్రామీణ ప్రాంతాల్లో 11 నుండి 18 సంవత్సరాల వయస్సున్న కిశోర బాలికలు సంపూర్ణ పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. రజస్వల అయిన తరవాత బాలికలు ప్రతి నెలా వస్తున్న పీరియడ్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ వయస్సులోనే పోషకాలున్న సమీకృత ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గి ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. 18 సంవత్సరాలు నిండిన తరవాతే వివాహాలు చేసుకోవాలని మైనర్ బాలికలకు వివాహాలు జరిపిస్తే చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజరాజేశ్వరి బాలికలకు అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే శిక్షణ తరగతులను కిశోర బాలికలు సద్వినియోగం చేసికోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ రాధాలక్ష్మి, సచివాలయ మహిళా పోలీస్ మహాలక్ష్మి, ఏఎన్ఎం సంతోషి పాల్గొన్నారు.



మంగళాపురంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ప్రకృతి సాగుతో రైతుకు, నేలకు మేలు



రైతులకు పప్పు జాతి విత్తనాలు అందిస్తున్న దృశ్యం

చీడికాడ : ప్రకృతి సాగుతో అటు రైతుకు ఇటు నేలకు ఆరోగ్యమని ఏడ కృష్ణవేణి అన్నారు. మంగళవారం మంచాలలో రైతు సాధికార సంస్థ, వ్యవసాయశాఖ, వెలుగు డిపార్టుమెంట్లు సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మంచాల గ్రామాన్ని శత శాతం మోడల్ గ్రామంగా ఎంపిక చేశామన్నారు. ఈ మేరకు ఖరీఫ్ సాగుకు ముందు 30 రకాల పప్పు జాతి విత్తనాలను రైతులకు అందించారు. ప్రతి రైతు తమకు గల పొలంలో కొంత మేర ప్రకృతి వ్యవసాయం సాగుకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోనాం, మంచాల సర్పంచ్‌లు చలుగు ఈశ్వరమ్మ, కసిరెడ్డి భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ కిముడు చిన్నమ్మలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

రావికమతం : కొత్తకోట శాఖ గ్రంథాలయానికి కొత్తకోట ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు తాళ్లపురెడ్డి శేషు ఆర్థిక సహాయంతో పుస్తకాలను మంగళవారం వితరణగా అందజేశారు. మేజర్ పంచాయతీ అయిన కొత్తకోట గ్రామంలో గల శాఖ గ్రంథాలయానికి చుట్టుపక్కల గ్రామాలైన దొండపూడి, చీమలపాడు, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, వమ్మవరం, కన్నంపేట, తదితర గ్రామాల నుంచి నిరుద్యోగులు, డీఎస్సీ (టీచర్),వివిధ పోటీ పరీక్షలకు వెళ్లే వారు, రిటైర్డ్ ఎంప్లాయీస్ యువకులు తరుచూ గ్రంథాలయానికి వస్తూ ఉంటారు. అందరికీ ఉపయోగపడే సుమారు రూ.7వేలు విలువ గల పుస్తకాలను అసోసియేషన్ సభ్యులు శేషు, గల్రెడ్డి రాంబాబు, కలం నర్సింగ్, అంగజాల వీర ప్రకాష్, తరిపే ఈశ్వరరావు, గుమ్ముడు వాసు, శాఖ గ్రంథాలయాధికారి వరహామణికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

చదవడం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో ఆంగ్ల అక్షరమాల గేమ్స్ ఆడిస్తున్న గ్రంథాలయ అధికారి దమయంతి



ఖోఖో ఆటలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

నర్సీపట్నం : విద్యార్థి దశ నుంచే చదవడం అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో రాణించగలరని గ్రంథాలయ అధికారిణి పి.దమయంతి విద్యార్థులకు సూచించారు. సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం మాస్ రీడింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలు చదవడం వల్ల అన్ని విషయాల్లో మంచి జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ మాట్లాడుతూ మలేరియా నియంత్రణ కోసం విశేషంగా కృషి చేసిన రోనాల్డ్ జయంతి సందర్భంగా అతని గురించి విద్యార్థులకు వివరించారు. ఆంగ్ల అక్షరమాలతో రిలే గేమ్ ఆడించారు.

వేసవి శిబిరాల్లో ఆటల పోటీలు

రోలుగుంట : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి వరలక్ష్మి మంగళవాల ఆటల పోటీలు నిర్వహించారు. ఖోఖో ఆటలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

నాతవరం : వాతావరణ పరిస్థితులు దృష్ట్యా వస్తున్న వ్యాధుల పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు చేపట్టాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మండలంలో చమ్మచింత గ్రామంలో మంగళవారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 149 మంది రోగులను పరీక్షించగా కొందరికి రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారి మాట్లాడుతూ తమ సూచనలు పాటిస్తే రోగాలు రాకుండా కాపాడుకోవచ్చునన్నారు. వేసవిలో అడపా దడపా పడుతున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. తాగునీటి పథకాలు బోర్లలో క్లోరినేషన్ చేసిన మంచినీళ్ల తాగాలన్నారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే గ్రామంలో ఉండే ఆశ కార్యకర్తను సంప్రదించాలన్నారు. గ్రామంలో ఎక్కువగా జ్వరాలు వస్తే వెంటనే తమకు సమాచారం ఇస్తే వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రెండు ఉన్నత పాఠశాలలు మంజూరు

మాకవరపాలెం: మండలంలో మరో రెండు ఉన్నత పాఠశాలలు మంజూరయ్యాయని ఎంఈవో మూర్తి తెలిపారు. మండలంలో ప్రస్తుతం మాకవరపాలెం, జీ కోడూరు, గిడుతూరు, వజ్రగడ, బూరుగుపాలెంలో ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. జీ వెంకటాపురం , జంగాలపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపగా, మంజూరు చేస్తూ విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చిందని ఎంఈవో తెలిపారు. అలాగే జీ కోడూరు, వజ్రగడ, గిడుతూరు ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



కె.కోటపాడులో గోడపత్రికలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకుడు ముత్యాలనాయుడు



మాకవరపాలెంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు



సమ్మె గోడ పత్రిక విడుదల చేస్తున్న దృశ్యం

కె.కోటపాడు : రైతుల పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించేందుకు స్వామినాథన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో మంగళవారం ఈ నెల 20న నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ముత్యాలనాయుడు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులకు నష్టం కలిగించడంతో పాటు ఉద్యోగుల ప్రాథమిక హక్కులు, ఉద్యోగ భద్రత లేకుండా చేసేలా పార్లమెంట్‌లో చట్టం చేసేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. దీనిని వ్యతిరేకిస్తూ చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు జి.కుమారి, ఆర్.ఈశ్వరరావు, సీపీఎం నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల నాయకులు మహాలక్ష్మి, పద్మ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం సమ్మె సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్, రైతులకు నష్టం చేకూర్చే నల్లచట్టాలను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రతతోపాటు మరికొన్ని సమస్యల పరిష్కారానికి ఈ సమ్మె చేపడుతున్నామన్నారు. సిఐటీయు ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

చీడికాడ : కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు కోరారు. ఈ మేరకు చీడికాడలో మంగళవారం సమ్మె గోడ పత్రిక విడుదల చేశారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం 4 కోడ్స్ మార్చి కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగించిందన్నారు. ఈ లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనాలు అమలు తదితర కార్మికులకు నష్టం కలిగించే చర్యలకు వ్యతిరేకంగా ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

రావికమతం : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాల కోసం లబ్ధిదారులు ఎంపికకు మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవా రం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకన్నబాబు చెప్పారు. యూనిట్లు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 275 దరఖాస్తులు వచ్చాయని, యూనిట్ స్థాపనకు బ్యాంకు అధికారుల సమక్షంలో లబ్ధిదారుల ఇంటర్వ్యూలు జరుగుతాయని, దరఖాస్తుదారులంతా ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు.

ఆలయ భూముల శిస్తులకు వేలం వాయిదా

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయ భూములు శిస్తులకు వేలం వాయిదా పడింది. ఇప్పటికే రెండుసార్లు వేలం నిర్వహించగా రైతులు ముందుకు రాలేదు. ఈవో దివ్యతేజ ఈ నెల 24న మళ్లీ వేలం నిర్వహణకు నిర్ణయించారు.

వేసవి ఎండలకు జనం ఉక్కిరిబిక్కిరి



ఎండలకు నిర్మానుష్యంగా మారిన కె.కోటపాడు రోడ్డు

కె.కోటపాడు : వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు గ్రామాల్లో నమోదవుతున్నాయి. ఎండల కారణంగా ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే భయాందోళనలు చెందుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ప్రజలు అధికంగా ఇండ్లకే పరిమితమవుతున్నారు. మంగళవారం మండలంలో పలు ప్రధాన కూడళ్లలో మధ్యాహ్న సమయాల్లో వాహనదారుల ప్రయాణాలు లేక ఆయా రహదారులు బోసిపోయాయి. ఎండల కారణంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులను పడుతున్నారు.

మోదకొండమ్మ సన్నిధిలో ఎంపీపీ రాజారామ్

మాడుగుల : పాడేరు మోదకొండమ్మ పండగ సందర్భంగా మంగళవారం మాడుగుల ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని ఆలయానికి కాలినడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.



ఘటాలు శిరస్సున పెట్టుకున్న మాడుగుల ఎంపీపీ రాజారామ్

రహదారి పనుల్లో నాణ్యత పరిశీలన



వడ్డాది నుంచి తాటిపర్తి రోడ్డు పనులు పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు

మాడుగుల రూరల్: మండలంలో వడ్డాది నుంచి తాటిపర్తి వరకు జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆర్ అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ అధికారి జి. వెంకటేశ్వర్లు, క్యాసి సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ అధికారి జి.వి.భాస్కర్ తదితరులు మంగళవారం పరిశీలించారు. రహదారి నాణ్యతను పరిశీలించారు. రహదారి కిరువైపులా, అలాగే కె.జె.పురం, ఎం.కోటపాడు గ్రామాల వద్ద నిర్మించిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ ఏడాది జూన్ చివరినాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేముడునాయుడు పాల్గొన్నారు.